క్లుప్తంగా

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

నరసరావుపేట: స్థానిక ప్రకాష్‌నగర్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం సాయంత్రం 5 గంటలకు పార్టీ ఆత్మీయ సమావేశం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. దీనికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, పలు కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, డైరెక్టర్లు, సర్పంచులు, మాజీ కౌన్సిలర్లు, వార్డు నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

నేడు పింఛన్ల పంపిణీ

నాదెండ్ల: సెప్టెంబర్ మాసం ఎన్టీఆర్ భరోసా-సామాజిక భద్రతా పెన్షన్లు పంపిణీ శనివారం చేయనున్నట్లు ఎంపీడీవో షేక్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. సెప్టెంబర్ 1వ తేదీ ఆదివారం కావటంతో ఈ నెల 31వ తేదీనే పెన్షన్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలో 9,563 మంది పెన్షన్ల లబ్ధిదారులకు గాను రూ.4,02,90, 500లు నగదు పంపిణీ చేయనున్నారు. ఇళ్లకు వెళ్లి పంపిణీ చేస్తారని తెలిపారు.

శావల్యాపురంలో...

శావల్యాపురం: మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో ఉన్ననటువంటి 5947 మంది పింఛనుదారులకు నేటి నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు గ్రామసచివాలయ సిబ్బందితో ఇంటింటికీ తిరిగి పింఛనుదారులకు నగదు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య శుక్రవారం తెలిపారు.

వీధులన్నీ జలమయం

వినుకొండ(నూజెండ్ల): వినుకొండ పట్టణంలో ఉదయం నుంచి కురిసిన వర్షానికి వీధులన్నీ జలమయంగా మారాయి. పట్టణంలోని ఇసుకవాగు బజారు, శివాలయం, ఆంజనేయస్వామి దేవాల యం వద్ద మోకాళ్ల లోతు నీళ్లు పారాయి. అలాగే ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కూడా వర్షపు నీరు నిలబడ్డాయి. సుమారు గంటన్నరకు పైగా భారీ వర్షం కురవడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. వాతావరణ శాఖ తెలిపిన వివరాల ప్రకారం మూడు రోజుల పాటు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలిపారు.

అర్హత ఉన్న మహిళా సభ్యులకు రుణాలు

శావల్యాపురం: స్వయం సహాయక సంఘాల్లోని మహిళా సభ్యులు జీవనోపాదులు మరింత పెంపుదలకు ప్రభుత్వం పరంగా తక్కువ వడ్డీ రేటుకు రుణాలు మంజూరు చేస్తుందని ఎపీయం జి.వాసుబాబు తెలిపారు. శుక్రవారం స్థానిక వెలుగు మండల సమాఖ్య కార్యాలయంలో ఏపీయం మాట్లాడుతూ స్త్రీనిధి పథకం ద్వారా 1000 మంది సభ్యులకు రూ. 5 కోట్లు, ఉన్నతి పథకం ద్వారా ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన ఒక్కో మహిళకు రూ.50 వేలు చొప్పున రుణాలు మంజూరు చేస్తామన్నారు. గ్రామసంఘాల ద్వారా అర్హత కల్గిన ఉన్న మహిళలను గుర్తించి తదుపరి రుణాలను మహిళల బ్యాంకు ఖాతాలో జమ చేస్తామన్నారు. ఆయనతో పాటు సీసీలు ఖాజావలీ, రమాదేవి, బేబిరాణి ఉన్నారు.

వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

వినుకొండ (నూజెండ్ల): రాష్ట్రంలో అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు విస్తారంగా వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎం.సుభాష్ చంద్రబోస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోతట్టు ప్రాంత ప్రజ లు నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పెద్దలు, చిన్న పిల్లలు తగు జాగ్రత్తలు లేకుండా బయటకు రాకూడదని తెలిపారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున కాచి చల్లార్చిన నీటినే తాగాలని, వేడివేడి ఆహార పదార్థాలను భుజించాలని తెలిపారు. ప్రజలందరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు.

భాషాభివృద్ధికి కృషి చేయాలి

నరసరావుపేట ఈస్ట్: తెలుగు భాషాభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని వినుకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆంధ్రోపన్యాసకులు డాక్టర్ జి.స్వర్ణలత తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కాకాని సుధాకర్ అధ్యక్షతన తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ స్వర్ణలత మాట్లాడుతూ, బడి భాష, ఇంటి భాష ఒక్కటిగా ఉండాలని వ్యవహారిక భాష ఉద్యమాన్ని నడిపిన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించటం ఆనందదాయకమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు శ్రీనివాసరావు, డాక్టర్ దీప, విద్యార్థులు పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

బెల్లంకొండ: కౌమార దశలో ఉన్న బాలికలు గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని సీహెచ్‌ఓ ఎం.ఝాన్సీ తెలిపారు. మండలంలోని వెంకటాయపాలెం గ్రామంలో శుక్రవారం 'కౌమార స్నేహ పూర్వక ఆరోగ్య దినోత్సవం' సందర్భంగా పాఠశాలలో బాలికలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మంచి, చెడు స్పర్శలను ఏ విధంగా గుర్తించాలో పాఠశాలలోని బాలికలకు అవగాహన కల్పించారు. చిన్నతనం నుంచే సెల్ఫ్ ప్రొటెక్షన్ అలవర్చుకోవాలని, అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. వివాహ వయసు, బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. పాఠశాల హెచ్‌ఎం బలరాం నాయక్, చైర్మన్ దీపాల కోటేశ్వరరావు, ఏఎన్‌ఎం సాగర్ మాత, ఉపాధ్యాయులు నాగలక్ష్మి, అరుణ కుమారి, అల్లాబి, స్వాతి, ఫర్జానా, ఆశ కార్యకర్తలు ధనలక్ష్మి, నాగమణి పాల్గొన్నారు.

ప్రత్యేక చట్టాలు రూపొందించాలి



మహిళా వైద్యులు, సిబ్బంది రక్షణ విషయంలో ప్రభుత్వాలు తప్పనిసరిగా ప్రత్యేక చట్టాలను రూపొందించాలి. రోగి ప్రాణాలు కాపాడే డాక్టర్లకే రక్షణ లేకపోతే విధులు నిర్వర్తించలేం. కోల్‌కతాలో వైద్యురాలుని హత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి.

– వడితె.ఝాన్సీబాయి,
ఎంఎల్‌హెచ్‌పీ, వెంకటాయపాలెం, బెల్లంకొండ



వైద్యులకు రక్షణ కల్పించాలి



కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచార ఘటన చాలా బాధాకరం. హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి. వైద్యులు, వైద్య సిబ్బంది విధులకు ఆటంకం కలగకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మహిళా వైద్య సిబ్బందికి విధి నిర్వహణలో ఒత్తిడి తగ్గించాలి. తగిన రక్షణ కల్పించాలి.

– తిరుపతమ్మ,
ఎంఎల్‌హెచ్‌పీ, మన్నెసుల్తాన్‌పాలెం, బెల్లంకొండ

పిల్లలూ.. బాగా ఆడారు!



ఏఎంజీ హైస్కూల్‌కు క్రీడా ప్రతిభా పురస్కారం దక్కింది. 2023–24 విద్యాసంవత్సరానికి గాను పాఠశాల విద్యార్థులు వివిధ క్రీడాంశాల్లో చూపిన ప్రతిభకు గాను 963 పాయింట్లతో పల్నాడు జిల్లాస్థాయిలో ప్రథమ స్థానం, రాష్ట్రస్థాయిలో తృతీయ స్థానంలో పాఠశాల క్రీడా విద్యార్థులు నిలిచారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు నరసరావుపేటలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఏఎంజీ హైస్కూల్‌కు ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని వివిధ క్రీడల్లో పాల్గొన్న పాఠశాల విద్యార్థులకు శుక్రవారం ఏఎంజీ ప్రాంగణంలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం కె.కృపాదానం, వ్యాయామ ఉపాధ్యాయులు రాజు, రాజేష్ పాల్గొన్నారు.

– చిలకలూరిపేట

నాడిపట్టి.. మందులిచ్చి...



మండలంలో సుబ్బయ్యపాలెం గ్రామ పరిధిలో గల గిరిజనవాడలో శుక్రవారం రొంపిచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో వైద్యాధికారి డాక్టర్ నిమ్మల సాయిబాబు పాల్గొని వైద్యపరీక్షలు చేశారు. 83 మందికి వైద్య పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించారు. ప్రాథమిక వైద్య పరీక్షల అనంతరం 8 మంది సాధారణ జ్వరాలు, జలుబు, దగ్గుతో బాధపడుతున్నట్లు గుర్తించారు. వారందరికీ అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సీజనల్‌లో వచ్చే మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరూ దోమతెరలను వినియోగించుకోవాలన్నారు. పరిసరాల శుభ్రతకు ప్రాముఖ్యతను ఇవ్వాలన్నారు. ఈ శిబిరంలో ఏఎన్‌ఎం కిరణ్‌పాల్గొన్నారు.

– రొంపిచర్ల

శభాష్.. మాస్టారూ...



ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం రసాయనశాస్త్ర బోర్డు ఆఫ్ స్టడీస్ సభ్యునిగా కృష్ణవేణి డిగ్రీ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ డి.యోగేశ్వరరావు నియమితులయ్యారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, అధ్యాపకులు ఆయనను అభినందించారు. రసాయనశాస్త్ర సిలబస్‌లో మార్పులు, నూతన కోర్సులు ప్రవేశపెట్టేందుకు సలహాలు, సూచనలు అందిస్తానని ఆయన వెల్లడించారు.

–నరసరావుపేట ఈస్ట్

నిమ్మకాయలతో...



శ్రావణ మాసం చివరి శుక్రవారాన్ని పురస్కరించుకొని చౌడేశ్వరీ అమ్మవారిని నిమ్మకాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం అమ్మవారి మూలమూర్తికి అభిషేకాలు నిర్వహించి నిమ్మకాయలను అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

– నరసరావుపేట ఈస్ట్

మేలు చేసిన వరుణుడు

- నాటిన 60 రోజులకు సరైన వర్షం
- పత్తి రైతులకు ఊరట



నాదెండ్లలో సాగులో ఉన్న పత్తి చేను

నాదెండ్ల: నిన్నా మొన్నటి వరకూ ఎండాకాలాన్ని తలపించిన ఎండలతో పంటలు ఎండుముఖం పట్టాయి. పత్తి నాటి 60 రోజులు దాటినా సరైన వర్షం లేకపోవటంతో పత్తి పంట ఎండుబారింది. పంట బెట్టదశకు వచ్చి పూత రాలటంతో రైతన్న ఆందోళన చెందాడు. జూన్ మొదటి వారంలో విత్తనాలు నాటగా, ఇప్పటికి 60 రోజులైనా రైతులు కాంప్లెక్స్ ఎరువులు పంటలు వేయలేని పరిస్థితి. తాజాగా బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా గురు, శుక్రవారాల్లో వర్షం కురవడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో 25 వేల ఎకరాలకు పైగా సాగు భూమి ఉండగా, గతేడాది పత్తి 5,900 ఎకరాల్లో, మిర్చి 4,400 ఎకరాల్లో, పొగాకు 300 ఎకరాల్లో, శనగ వెయ్యి ఎకరాల్లో సాగు చేశారు. ఈ ఖరీఫ్‌లో పత్తి సాగు స్వల్పంగా తగ్గినా మిర్చి సాగు సాధారణంగా ఉంది. పొగాకు, శనగ సాగు అధికంగా ఉంది. పత్తి సాగు చేసి రెండు నెలలు దాటగా, ప్రస్తుతం మిర్చి సాగు ప్రారంభించారు. మరికొద్దిరోజుల్లో పొగాకు నాట్లు వేయనున్నారు. శనగ అక్టోబర్‌లో వేయనున్నారు. గత సీజన్‌లో పొగాకు గరిష్టంగా రూ.16–17 వేలకు కొనుగోలు చేయడంతో రైతులు లాభాలబాట పట్టారు. అయితే ఈ ఏడాది పొగాకు ధరలు ఆశాజనకంగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరిగింది. శనగ పంటకు మంచి ధరలు పలుకుతుండటంతో రైతులు ఈ పంట వైపు మొగ్గు చూపుతున్నారు. పత్తి, మిర్చి పంటలు ధరల్లో ఆశాజనకంగా ఉన్నా, ఆశించిన దిగుబడులు లేక నష్టాల పాలౌతున్నారు. పత్తిలో గులాబీ రంగు పురుగు, మిర్చిలో జెమిని / బొబ్బర వైరస్ (ఆకుముడత) కారణంగా రైతులకు నష్టాలు తప్పటం లేదు.

పెరిగిన సీసీఐ పత్తి మద్దతు ధర

గతేడాది పత్తి క్వింటా మద్దతు ధర రూ.7020లు ఉండగా, కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది రూ.7521 మద్దతు ధరగా నిర్ణయించింది. అంటే క్వింటాకు సగటును రూ.501లు ధర పెరిగింది. గతేడాది కన్నా ఈ ఏడాది మిర్చి ధరలు తగ్గుముఖం పడటంతో రైతులు ఆసక్తి చూపటం లేదు. గతేడాది పొగాకు, శనగ ధరలు బాగా పెరగటంతో భూయజమానులు కౌలు ధరలు పెంచారు. పెరిగిన కౌలు ధరలు, కూలీ ఖర్చులు తడిసి మోపెడవుతుండటంతో రైతులకు పంటల సాగుపై పెద్దగా మిగలటం లేదు.

అన్ని పంటలకు ప్రయోజనం



గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో అన్ని రకాల పంటలకు ప్రయోజనం చేకూరనుంది. ముఖ్యంగా బెట్టకొచ్చిన పత్తికి మేలు. ఇప్పటికే పత్తి నాటి 60 రోజులు దాటింది. ప్రస్తుతం పత్తి పూత, పిందె దశలో ఉంది. రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టి గులాబీరంగు పురుగు ఉధృతిని నివారించేందుకు వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి. మెరుగైన సస్యరక్షణతో నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చు.

–హరిప్రసాద్, మండల వ్యవసాయాధికారి

సంతగుడిపాడులో పిచ్చి కుక్క స్వైర విహారం

పది మందికి గాయాలు



కుక్క కాటుకు గురై వి.రెడ్డిపాలెం వైద్యశాలకు వచ్చిన సంతగుడిపాడు గ్రామస్తులు

రొంపిచర్ల: మండలంలోని సంతగుడిపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం పిచ్చి కుక్క స్వైర విహారం చేసి 10 మందిని కరిచింది. వివరాల్లో కెళ్లితే.. గ్రామంలో కొన్ని రోజులుగా పిచ్చి కుక్క సంచారం చేస్తోంది. ఆ కుక్క మనుషులతో పాటు జంతువులను కూడా కరుస్తోంది. అయితే శుక్రవారం ఉదయాన్నే ఆ పిచ్చి కుక్క రెండు వీధుల్లో తిరిగి పది మందిని కరిచింది. శ్రావణ శుక్రవారం కావటంతో చీకటిలోనే వీధులను శుభ్రపరిచి ముగ్గులు వేస్తున్న మహిళలను కరుస్తుండగా అదిలించిన వారిని కూడా ఈ కుక్క కరిచింది. ఈ క్రమంలో ఒకే ఇంట్లో ముగ్గురిని కరిచింది. ఓ వీధిలో కుక్క కరిచిందని ఆ వీధిలో వారంతా బయటకు వచ్చి కర్రలతో వెంబడించగా మరో వీధిలోకి వెళ్లి ఆ వీధిలో వారినీ కరిచింది. అయితే చీకటిగా ఉండటంతో ఆ కుక్క తప్పించుకుంది. కుక్క కాటుకు గురైన వారిలో సి.హెచ్.చెన్నారెడ్డి, 80 ఏళ్ల వయస్సు ఉన్న సి.హెచ్. వీరమ్మ, వి. వెంకటరత్నం, పి. విజయనిర్మల, 75 వయస్సు ఉన్న పి. కొండమ్మ, షేక్ రసూల్, పి. పార్వతి, ఎల్. వెంకటేశ్వర్లు, డి. సీతమ్మతో పాటు 12 సంవత్సరాల వయస్సున్న వి. ఆకాష్ కూడా ఉన్నాడు. పిచ్చి కుక్క కరిచిన వారంతా దగ్గరిలోని వి.రెడ్డిపాలెంలో గల వైద్యశాలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. తీవ్రంగా గాయాల పాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం నరసరావుపేట వైద్యశాలకు తరలించారు.

గాలించి బంధించారు

ఒకే రోజు సంతగుడిపాడు గ్రామంలో పది మందిని కరచి కనపడకుండా పోయిన పిచ్చికుక్క కోసం గ్రామస్తులు గాలింపు ప్రారంభించారు. సాయంత్రం 3 గంటల ప్రాంతంలో ఓ వీధిలో ఆ కుక్కను గుర్తించారు.

ఘనంగా ఆఖరి శ్రావణ శుక్రవారం

అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీవ్రత పూజలు



నరసరావుపేటలో దర్శనమిచ్చిన వరలక్ష్మీమాత



విప్పర్లలో దర్శనమిచ్చిన కామాక్షి అమ్మవారు



వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న అర్చకస్వాములు



వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

నరసరావుపేట రూరల్: ఇస్సప్పాలెంలోని శ్రీ మహంకాళి అమ్మవారి ఆలయంలో శ్రావణ శుక్రవారాన్ని పురస్కరించుకుని హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. కార్యక్రమంలో 125 మంది మహిళలు పాల్గొన్నారు. గణపతి పూజ, అమ్మవారికి అష్టోత్తర కుంకుమార్చన అనంతరం వరలక్ష్మీ వ్రతం జరిపారు. ఆలయ అర్చకులు నండూరి కాళికృష్ణ, కొత్తలంక కార్తీకేయ ఆధ్వర్యంలో వ్రతం నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న మహిళలకు ఉచితంగా పూజా ద్రవ్యములు, శేషవస్త్రం, ప్రసాదాలు పంపిణీ అందజేశారు. ఆలయ ఈవో టి.సుధాకరరెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రొంపిచర్ల మండలంలో....

రొంపిచర్ల: మండల ప్రజలు శ్రావణ మాస నాల్గవ శుక్రవారం వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. మహిళలు జగన్మాతకు పూజలు నిర్వహించి ముత్తయిదువులకు తాంబూలాలు పంపిణీ చేశారు. శ్రావణ మాసంలో శుక్రవారానికి ఉన్న ప్రాముఖ్యత ఎక్కువ. చివరి శుక్రవారం కావడంతో మహిళలందరూ గృహాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాల్లో దేవతలు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. రొంపిచర్లలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి, శ్రీ త్రిపుర సందరీ సమేత శంకరస్వామి, వడ్లమూడివారిపాలెం గంగాపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి, విప్పర్లలోని గంగా పార్వతీ సమేత వల్లభేశ్వరస్వామి తదితర ఆలయాలు భక్తులతో నిండాయి. ఆయా ఆలయాల ప్రధానార్చకులు పూజలు నిర్వహించి శ్రావణ శుక్రవారం విశిష్టతను భక్తులకు తెలియజేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

ఉపాధ్యాయ సర్దుబాటులో లోపాలు సరిచేయాలి



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

చిలకలూరిపేట: ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియలో అనేక లోపాలు ఉన్నాయని, వాటిని సరిచేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఎస్టీయూ రాష్ట్ర పూర్వ కార్యదర్శి పోటు శ్రీనివాసరావు కోరారు. పట్టణంలోని ఎస్టీయూ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సంఖ్య అధికంగా ఉన్న పాఠశాలలకు, విద్యార్థులు తక్కువగా ఉన్న పాఠశాలల నుంచి ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడానికి ఆన్‌లైన్ నమోదు, ఆన్‌లైన్ సర్దుబాటు వలన అనేక సమస్యలు వస్తున్నాయని వెల్లడించారు. ప్రతి ఏడాది జరిగే ప్రక్రియను ప్రస్తుతం జటిలం చేశారని విమర్శించారు. జీవో నంబర్ 84 ప్రకారం జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపల్, మేనేజ్‌మెంట్ వారీగానే ఉపాధ్యాయుల సర్దుబాటు చేయాల్సి ఉంటుందన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో వెంటనే ప్రమోషన్స్ కోసం షెడ్యూల్ ప్రకటించి ప్రమోషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత మాత్రమే సర్దుబాటు చేయాలని చెప్పారు. దీనికి గాను మెరిట్ కమ్ రోస్టర్ సీనియారిటీ జాబితా సిద్ధం చేసి ఆ తర్వాత మాత్రమే సర్దుబాటు చేయాలని కోరారు. సీనియర్ల విల్లింగ్ ఇస్తే తప్పక ఆమోదించాలని డిమాండ్ చేశారు. మండల పరిషత్ ఉపాధ్యాయులను మున్సిపాలిటీల్లో సర్దుబాటు చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. జీవో 84 వలన ఉపయోగం లేనప్పుడు ఆ జీవోను రద్దు చేసి మున్సిపల్ పాఠశాలలకు అర్బన్ ఎంఈవోను నియమించాలని కోరారు. మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించకుండా జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో నింపే ప్రయత్నాలను తీవ్రంగా వ్యతిరేకిస్తామని వెల్లడించారు. ఎస్టీయూ నాయకులు వినుకొండ అక్కయ్య, మేకల కోటేశ్వరరావు, వడ్లాన జయప్రకాశ్, షేక్ జమీర్‌బాషా, షేక్ ఫరీసా, ఎస్ కాలేషా, ఐ అంకమ్మరావు పాల్గొన్నారు.

రొంపిచర్లలో 12.2 మి.మీ. వర్షపాతం

రొంపిచర్ల: మండలంలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం విస్తృతంగా వర్షం కురిసింది. శుక్రవారం ఉదయానికి మండల కేంద్రమైన రొంపిచర్లలో 12.2 ఎం.ఎం వర్షపాతం నమోదైందని తహసీల్దార్ కార్యాలయ అధికారులు తెలిపారు. కాగా డివిజన్ కేంద్రమైన నరసరావుపేట లో 16.8 ఎం.ఎం, యడ్లపాడులో 14.6, చిలకలూరిపేటలో 12.6, నాదెండ్ల 11.4, బొల్లాపల్లి 6.2, వినుకొండలో 2.2, నూజెండ్ల, శ్యావల్యాపురంలో 2.0, ఈపూరులో 1.4 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. డివిజన్ మొత్తంలో 79.2 ఎం.ఎం వర్షపాతం నమోదు కాగా, సగటున 7.9 ఎం.ఎం వర్షపాతం నమోదైంది. ఉదయం నుండి సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షపు జల్లులు పడుతుండటంతో వ్యవసాయ పనులకు అటంకం కలిగి నిలిచి పోయాయి.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



మీట్ విత్ స్టూడెంట్స్ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, వైస్‌చాన్స్‌లర్ మురళీకృష్ణ

నరసరావుపేట రూరల్: తల్లిదండ్రుల కష్టాన్ని గుర్తించుకొని క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉన్నత స్థానానికి ఎదగాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. కాకానిలోని జేఎన్‌టీయూఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన వన మహోత్సవంలో ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ అరవింద బాబు, జేఎన్‌టీయూ కాకినాడ ఇన్‌చార్జ్ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ కె.వి.ఎస్.జి. మురళీకృష్ణలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీట్ విత్ స్టూడెంట్స్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జేఎన్‌టీయూ కాకినాడ ఇన్‌చార్జ్ వైస్‌చాన్స్‌లర్ మురళీకృష్ణ మాట్లాడుతూ కాకినాడ జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థులు దేశంలోనే ఉన్నతస్థానాల్లో ఉన్నారని తెలిపారు. అటువంటి వారిని విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సి.హెచ్. శ్రీనివాసరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏస్‌బీఐ నిర్లక్ష్యం - రైతులకు శాపం

శావల్యాపురం: ఎస్‌బీఐ బ్యాంకు మేనేజర్ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. సేకరించిన సమాచారం ప్రకారం.. మండల పరిధిలోని వేల్పూరులో ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్ శాఖలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఖాతాదారులు 127 మంది రైతులు వ్యవసాయ పరమైన పంట రుణాలు తీసుకున్నారు. ఈక్రమంలో రైతులు తీసుకున్న రుణాల చెల్లింపులకు (రెన్యూవల్స్) బ్యాంకు పరంగా తగిన ధ్రువీకరణ పత్రాలు గతంలో విధులు నిర్వహించిన బ్రాంచ్ మేనేజరుకు అందజేశారు. సదరు బ్యాంకు మేనేజరు రైతులు అందజేసిన ధ్రువీకరణ పత్రాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయకపోవటం చేత అదనపు వడ్డీ భారం రైతులపై పడింది. దీంతో బ్యాంకు వడ్డీ రూ.70 పైసలకు గాను అదనంగా రూ.17 పైసలు రైతులు చెల్లించాల్సి వచ్చింది. దీనివల్ల ప్రభుత్వం అందించే వడ్డీ రాయితీని తామంతా కోల్పోయినట్లు అన్నదాతలు ఆవేదన చెందారు. ఈ విషయమై బ్రాంచ్ మేనేజరు బి.వి.భార్గవ్‌నాయుడు మాట్లాడుతూ బ్రాంచ్ పరిధిలో 127 మంది రైతులకు రెండు నెలల వ్యవధి వరకు మాత్రమే అదనపు వడ్డీ పడుతుందన్నారు. మళ్లీ ఇలాంటి ఘటన పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటామని, రైతులకు ఖాతాదారులకు మెరుగైన బ్యాంకు సేవలు పారదర్శకంగా అందిస్తామని వెల్లడించారు.

గెలుపొందిన విజేతలకు బహుమతులు

వినుకొండ(నూజెండ్ల): పట్టణంలోని నరసరావుపేట రోడ్డులో గల మహాత్మ జ్యోతిరావుపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన గురుకుల బాలుర పాఠశాలలో హాకీ మాంత్రికుడైన ధ్యాన్ చంద్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర ప్రసాద్, ఏటీపీ రాధ, పీఈటీ జోనా నాయక్, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మస్తాన్‌కు అభినందనలు



వినుకొండ(నూజెండ్ల): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన – అగ్నిమాపక సేవల శాఖ ఉద్యోగుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా వినుకొండ అగ్నిమాపక శాఖలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న షేక్ మస్తాన్ ఎన్నికయ్యారు. ఇటీవల గుంటూరు రెవెన్యూ కల్యాణ మండపంలో జరిగిన రాష్ట్ర అసోసియేషన్ ఎన్నికల్లో ఉపాధ్యక్ష పదవికి ఇద్దరు పోటీ పడగా మస్తాన్ 189 ఓట్ల అత్యధిక మెజార్టీతో ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు. నూతనంగా ఎన్నికైన మస్తాన్‌ను పలువురు అధికారులు అభినందనలు తెలియజేశారు.

శావల్యాపురం హైస్కూలుకు క్రీడా ప్రతిభ అవార్డు



కలెక్టరు నుంచి అవార్డు అందుకుంటున్న విజయలక్ష్మి, రాధాకృష్ణమూర్తి

శావల్యాపురం: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల జిల్లాస్థాయిలో ఐదవ స్థానం సాధించినట్లు శావల్యాపురం జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఈ అవార్డును జిల్లా కలెక్టరు పి.అరుణ్‌బాబుచేతుల మీదగా నరసరావుపేట కలెక్టరు కార్యాలయంలో జరిగిన సదస్సులో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, పీడీ రాగుల రాధాకృష్ణమూర్తిలు ప్రతిభ పురస్కార్ ప్రశంసా పత్రం మొమెంటో అందుకున్నట్లు తెలిపారు.